

తిరుపతి బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.57,930
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,174
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.66,800
రిటైల్ వెండి గ్రాము	రూ.68.80

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	29	14
చిత్తూరు	33	19
తిరుమల	33	18
గూడూరు	33	21
నగరి	33	18



మూడు లక్షల లడ్డూలు సిద్ధం

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల కోసం శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారులు ప్రసాదాలను సిద్ధం చేస్తున్నారు. ఈసారి మొత్తం మూడు లక్షల లడ్డూలను తయారు చేయిస్తున్నట్టు ఈఓ కేవీ సాగర్‌బాబు తెలిపారు.

న్యూస్‌రీల్

సర్వే పూర్తయితే సరిహద్దు రాళ్లు నాటండి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ

తిరుపతి అర్బన్: రీసర్వే పూర్తయిన చోట సరిహద్దు రాళ్లు నాటేపనులు కూడా పూర్తిచేయాలని జేసీ డీకే బాలాజీ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో డీఆర్వో శ్రీనివాసరావుతో కలిసి ఆయన అధికారులతో సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ ఇప్పటికే భూహక్కు పత్రాలు పొందిన వారి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. మ్యూటేషన్లకు సంబంధించి వారసులు ఒక్కరే ఉంటే తక్షణమే పూర్తిచేయాలన్నారు. డీఆర్వో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కోర్టు ఉత్తర్వుల మేరకు ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులు డీఈఓ కౌంటర్ సంతంకం లేకుంటే ఓటరుగా ఆమోదించరాదని స్పష్టం చేశారు. ఆర్డీఓలు కనకనరసారెడ్డి, కిరణ్‌కుమార్, చంద్రముని, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ కోదండరామిరెడ్డి, సర్వే జిల్లా అధికారి జయరాజ్, పలువురు తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

22న తిరుపతికి ఏకసభ్య కమిషన్ రాక

తిరుపతి అర్బన్: వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై అధ్యయనం చేయడానికి ఈ నెల 22వ తేదీన తిరుపతి ఆర్డీఓ కార్యాలయానికి ఏకసభ్య కమిషన్ బృందం రానుందని శుక్రవారం కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ క్రమంలో వాల్మీకి, బోయలకు చెందిన ప్రజలు, నాయకుల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తారని పేర్కొన్నారు.

హాల్ టికెట్లు ఇవ్వకుంటే చర్యలు

తిరుపతి ఎడ్యుకేషన్: రానున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో బోర్డు నియమనిబంధనల మేరకు అటెండెన్స్ ఉన్న ప్రతి విద్యార్థికీ తప్పనిసరిగా హాల్ టికెట్లు ఇవ్వాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని ఆర్‌ఐఓ వీ.రమేష్ ఓ ప్రకటనలో హెచ్చరించారు. గతంలో హాల్‌టికెట్లు ఇవ్వకుండా కొన్ని కళాశాలలు విద్యార్థులను వేధించినట్లు బోర్డు దృష్టికి వచ్చిందని, ఈ నేపథ్యంలోనే అటెండెన్స్ ఉన్న విద్యార్థులందరికీ హాల్ టికెట్లు ఇవ్వాలని తెలిపారు. హాల్ టికెట్లు ఇవ్వకుండా వేధిస్తుంటే 18004257635 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల్లోపు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

శివరాత్రికి 1,200 మందితో భద్రత

తిరుపతి క్రైం: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు గతంలో ఎన్నడూ లేని విధంగా 1,200 మందితో పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నట్టు ఎస్పీ తెలిపారు. శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సుమారు మూడు లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్టు వెల్లడించారు. సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, అదే సమయంలో వీఐపీలకు కూడా తగిన సమయం కేటాయించినట్టు వెల్లడించారు. వాహనాల పార్కింగ్, దారి మళ్లింపు ఉన్న ప్రతిచోటా సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, ఎంట్రీ, ఎగ్జిట్ గేటుల వద్ద భక్తులకు సమాచారం పూర్తిగా తెలిసేలా హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేశామన్నారు. కల్యాణోత్సవం నాడు బాల్యవివాహాలు జరగకుండా మహిళా పోలీసు సిబ్బంది, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఐసీడీఎస్ అధికారులు సమన్వయంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ప్రముఖ శైవక్షేత్రాలైన ముక్కోటి, తలకోన, కపిల తీర్థం, జీవకోన, గుడిమల్లం, సురుటుపల్లి, కైలాసకోన, సదాశివకోన, కోట మండలం దేవాలయాల్లో కూడా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కొత్త కూడళ్లు ప్రారంభం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణ శివారులోని కొత్తకూడళ్లను శుక్రవారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. చెన్నై రోడ్డు ఎంజీఎం ఆస్పత్రి కూడలి వద్ద భక్తకన్నప్ప విగ్రహం, నాయుడుపేట–పూతలపట్టు బసవయ్య పాళెం వద్ద నంది విగ్రహాన్ని ఆయన ప్రారంభించారు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా వీటిని తీర్చిదిద్దారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



కాంతులీనుతున్న శ్రీకాళహస్తీశ్వరాలయం

శోభాయమానం.. శివయ్య ఆలయం

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఆలయం లోపల తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి తెప్పించిన 27 టన్నుల పుష్పాలు, 45 టన్నుల ఫలాలతో చూడముచ్చటగా అలంకరించారు. విద్యుద్దీపాల వెలుగులు భక్తులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. శివరాత్రికి మూడు లక్షల మందికిపైగా భక్తులు రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. శనివారం తెల్లవారుజామున 3 గంటల నుంచి భక్తులను స్వామి, అమ్మవార్ల దర్శనానికి అనుమతించనున్నట్టు ఆలయ ఈఓ సాగర్‌బాబు తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. - శ్రీకాళహస్తి రూరల్

పట్టువస్త్రాల సమర్పణ



మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ప్రభుత్వం తరఫున మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులుతో కలిసి ముక్కంటీశునికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్టు మంత్రి పేర్కొన్నారు. - శ్రీకాళహస్తి



సుగంధ సుమాలతో కనువిందుగా..



తొమ్మిది రకాల ఫలాలతో ఆకట్టుకునేలా..

బీసీలు బైబై!

నాడు

గత టీడీపీ ప్రభుత్వం బీసీలను రాజకీయాలకే వాడుకుంది. కేవలం ఓటు బ్యాంక్‌గానే ఉపయోగించుకుంది. చట్టసభల్లో గానీ, రాజకీయ పదవుల్లోగానీ తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా అణగదొక్కింది. నామమాత్రంగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి తూతూమంత్రంగా నిధులు విదిల్చింది. ఒక్క మాటలో చెప్పాలంటే కూరలో కరివేపాకులా వాడుకుని పక్కనబెట్టింది. చంద్రబాబునాయుడు హయాంలో జరిగిన అన్యాయం బీసీలకు బాగా అర్థమైంది. ఏళ్ల తరబడి మోస్తున్నా.. అడుగడుగునా అవమానాలే ఎదురవుతుండడంతో ఒక్కొక్కరుగా పార్టీని వీడుతూ బాబుకు బైబై చెప్పే పరిస్థితి వచ్చింది.

నేడు

'బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదు.. వారు సమాజానికి బ్యాక్ బోన్‌లాంటి వారు' అని నమ్మిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఇదే విషయాన్ని అనేక సందర్భాల్లో ఉచ్చరిస్తూ వారికి అండదండగా నిలుస్తున్నారు. చట్టసభల్లో సైతం వారికి సముచిత స్థానం కల్పించారు. రిజర్వేషన్ల ప్రాతిపదికన రాజకీయ పదవులు కట్టబెట్టారు. కార్పొరేషన్లకు కావాల్సిన నిధులు సమకూర్చారు. ఆర్థిక అసమానతలు తొలగించేందుకు అనేక పథకాలు తీసుకొచ్చారు. బీసీల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి వేల కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈ నేపథ్యంలోనే పలువురు బీసీలు వైఎస్సార్‌సీపీకి వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. గతంలో ఎప్పుడూ తమను ఇంతలా ఆదరించలేదని గొప్పగా చెప్పుకుంటున్నారు.



- టీడీపీని వీడుతున్న బీసీ నేతలు
- మొన్న తిరుపతిలో డాక్టర్ సిపాయి.. నేడు చిత్తూరులో షణ్ముగం
- వరుస దాడులు... పార్టీలో గుర్తింపు లేకపోవడమే కారణం
- శివరాత్రి తర్వాత కార్యాచరణ ప్రకటించే అవకాశం!

సాక్షి, తిరుపతి: జిల్లాలోని బీసీ నాయకులు టీడీపీకి గుడ్‌బై చెబుతున్నారు. పార్టీలో సముచిత స్థానంలేక కొందరు.. బాబు సామాజికవర్గం దాడులకు భయపడి మరికొందరు.. చులకన చేసి మాట్లాడడంతో ఇంకొందరు రాజీనామాలు చేస్తున్నారు. ఆ పార్టీలో తగిన గుర్తింలేక ఒక్కొక్కరూ బయటకు వస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మంచి పేరున్న వన్నెకుల క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం టీడీపీకి, పార్టీ ఇచ్చిన పదవికి రాజీనామా చేశారు. తాజాగా చిత్తూరుకు చెందిన బీసీ నాయకుడు, టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పి షణ్ముగం శుక్రవారం ఉదయం టీడీపీకి, తన పదవికి గుడ్‌బై చెప్పారు. ఇది వరకే చిత్తూరు నగర పార్టీ అధ్యక్షుడిగా పనిచేసిన వన్నెకుల క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన మాపాక్షి మోహన్ టీడీపీకి రాజీనామా చేసిన విషయం తెల్సిందే.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో బీసీలే అధికం

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో బీసీ సామాజికవర్గం వారే అధికం. మొత్తంగా 15 లక్షలకుపైగా ఓటర్లుండగా వీరిలో వన్నెకుల క్షత్రియ సామాజికవర్గానికి చెందిన ఓటర్లే సుమారు 40 శాతం ఉన్నారు. కుప్పం, నగరి, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో వన్నెకుల క్షత్రియ సామాజికవర్గం ఓట్లే కీలకం. అందుకే వారిలో ముఖ్యమైన కొందరిని ఎంపిక చేసుకుని టీడీపీ నేతలు ఇప్పటికీ ఎన్నికల వరకే వాడుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

బీసీల సాధికారత ఎక్కడ?



బీసీల సాధికారతే లక్ష్యంగా ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారు. చంద్రబాబు పార్టీని లాక్కున్న తర్వాత ఆ లక్ష్యాన్ని నీరుగార్చారు. బీసీల అభ్యున్నతికి కృషి చేస్తున్నానని ప్రకటనలు చేసేవారే తప్ప క్షేత్రస్థాయిలో వారికి చేసింది శూన్యం. చంద్రబాబు హయాంలో బీసీలు దగాపడ్డారు. స్థానిక సంస్థల నుంచి పార్లమెంట్ అభ్యర్థి వరకు వారి సామాజిక వర్గానికి మాత్రమే ప్రాధాన్యం ఇచ్చారు. బీసీలను ఓట్ల కోసం వాడుకుని వదిలేశారు. టీడీపీలో ఎంత కష్టపడినా బీసీలకు న్యాయం, తగిన గౌరవం, గుర్తింపు లభించదు. 15 ఏళ్ల తన రాజకీయ జీవితంలో నన్ను నమ్మిన బీసీల కోసం నేను ఏమీ చేయలేకపోయాను. అందుకే టీడీపీకి రాజీనామా చేశాను.

-డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, తిరుపతి

బీసీలను అణగదొక్కేందుకు కుట్ర



టీడీపీ కోసం కష్టపడ్డాను. 32 ఏళ్లుగా పార్టీని నమ్మాను. చంద్రబాబు, లోకేష్, ముఖ్యనాయకులు వస్తే వారి కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు అహర్నిశలు శ్రమించాను. అయితే పార్టీలో నాకు తగిన గుర్తింపు ఇవ్వలేదు. మొన్న లోకేష్ పర్యటనలో పులివర్తి నాని నాపై దాడిచేసేందుకు వచ్చారు. ఈ విషయాన్ని లోకేష్‌కు ఫిర్యాదు చేశాను. నానిపై చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అందుకే టీడీపీకి రాజీనామా చేశాను. చిత్తూరులో బీసీలను అణగదొక్కేందుకు కుట్రపన్నుతున్నారు. బీసీల దెబ్బ ఎలా ఉంటుందో టీడీపీ వారికి రుచిచూపిస్తాం.

- పీ షణ్ముగం, టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్, చిత్తూరు

దాడులు చేస్తూ..చులకనగా చూస్తూ

బాబు సామాజికవర్గం నేతలు బీసీలను చులకన చేయడం, పార్టీలో తగిన ప్రాధాన్యత కల్పించకపోవడం వారిని మరింత కుంగదీస్తోంది. మరో వైపు దాడులకు తెగబడుతున్నట్లు బాధితలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిత్తూరుకు చెందిన పీ షణ్ముగంపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు పులివర్తి నాని, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు దాడిచేసినట్లు ప్రచారం జరుగుతోంది. అందుకే షణ్ముగం ఆ పార్టీకి రాజీనామా చేసినట్లు ఆ పార్టీ నాయకులే బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

ఏకమవుతున్న బీసీలు

టీడీపీలో బీసీలకు జరుగుతున్న అవమానాలను జీర్ణించుకోలేక ఆ సామాజికవర్గ నేతలంతా ఏకమవుతున్నారు. తిరుపతికి చెందిన డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో వన్నెకుల క్షత్రియులతో పాటు మిగిలిన బీసీ సామాజికవర్గం నాయకులు, కార్యకర్తలు రోజూ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాల్లో టీడీపీ చేసిన అన్యాయాలు, ఆగడాలను ఎండగడుతున్నారు. శివరాత్రితర్వాత ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీలు సమావేశం ఏర్పాటు చేసి కార్యాచరణ ప్రకటించనున్నట్టు సమాచారం.

మొదలైన బుజ్జగింపుల పర్వం

బీసీలు ఒక్కొక్కరుగా పార్టీని వీడితుండడంతో చంద్రబాబు దిద్దుబాటు చర్యలకు దిగారు. పలువురు మాజీ మంత్రులను బీసీ నాయకుల నివాసాలకు పంపుతున్నారు. చేసిన తప్పులను సరిదిద్దుతామని చెబుతున్నట్టు ఆ పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. అయితే టీడీపీకి ఇప్పటి వరకు చేసిన సేవలు చాలని, తమకు ఏ పార్టీ ప్రాధాన్యత కల్పిస్తుందో వారి వెంట నడుస్తామని స్పష్టం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయాలు బయటకు రాకుండా ఉండేందుకు పార్టీకి రాజీనామా చేసిన వారిని టీడీపీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు అధిష్టానం నుంచి లేఖలు విడుదల చేయడం గమనార్హం.

ఎస్‌ఐ రాత పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు

- తిరుపతిలో 21 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 12,799 మంది అభ్యర్థులు
- ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి వెల్లడి



అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైం: ఎస్‌ఐ ప్రిలిమినరీ రాత పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టినట్టు ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం నగరంలోని ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాల, ఎస్జీఎస్, ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం జరిగే ఎస్‌ఐ ఉద్యోగాల రాత పరీక్షకు తిరుపతి నగరంలో మొత్తం 21 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మొత్తం 12,799 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నట్టు వెల్లడించారు. స్ట్రాంగ్ రూమ్, పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ చేస్తున్నట్టు తెలిపారు. అభ్యర్థులు ప్రభుత్వం ఇచ్చిన ఏదైనా ఒక ఒరిజినల్ గుర్తింపు కార్డును, హాల్ టికెట్‌ను, బ్లూ అండ్ బ్లాక్ బాల్ పెన్నును మాత్రమే పరీక్ష గదిలోకి అనుమతిస్తామన్నారు. అభ్యర్థులు ఎవ్వరూ విలువైన వస్తువులను తమ వెంట తీసుకుని రావద్దని విజ్ఞప్తి చేశారు. అభ్యర్థులు కాపియింగ్ లేదా మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడి పట్టుబడితే తదుపరి పోలీస్ నియామకాల్లో ప్రవేశాన్ని జీవితాంతం కోల్పోవడమే కాకుండా వారిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామన్నారు.

పరీక్షా కేంద్రాల సమీపంలో 144 సెక్షన్

పరీక్షా కేంద్రాల దగ్గర 144 సీఆర్‌పీసీ అములులో ఉంటుందన్నారు. ఎవ్వరూ గుంపులుగా ఉండకూడదని చెప్పారు. పరీక్షా కేంద్రాలకు దగ్గరలోని జిరాక్స్ షాపులను మూసివేయడంతో పాటు వైఫై సేవలను కూడా నిలిపివేస్తామన్నారు. వంద మీటర్ల పరిధి వరకు ఎటువంటి వాహనాలను పార్కింగ్ చేయకూడదన్నారు. అవకతవకలు జరగకుండా అదనపు ఎస్పీ లను వెంకటరావు అడ్మిన్, సెబ్‌జాయింట్ డైరెక్టర్ రాజేంద్ర, మునిరామయ్య తిరుమల వారిని పరీక్షల బందోబస్తు పర్యవేక్షణ అధికారులుగా నియమించినట్టు తెలిపారు.

మోసగాళ్ల మాటలు నమ్మి మోసపోవద్దు

సోషల్ మీడియాలో కానీ ఎవరైనా డబ్బులు ఇస్తే ఎస్‌ఐ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికితే వాటిని నమ్మద్దని ఎస్పీ సూచించారు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో హెల్ప్ డెస్కులతో పాటు అభ్యర్థుల సౌలభ్యం కోసం ఉదయం 7 నుంచి 8.45 గంటల వరకు పోలీసు వాహనాలను కూడా ఏర్పాటు చేసామన్నారు. నగరంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ట్రాఫిక్ డీఎస్పీల నేతృత్వంలో తగిన ఏర్పాట్లు చేశామన్నారు. అదనపు ఎస్పీ వెంకటరావు, సెబ్ జాయింట్ డైరెక్టర్ రాజేంద్ర, డీఎస్పీలు, సీఐలు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జూన్ 3న ఆర్ఐఎంసీ ప్రవేశ పరీక్ష

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కళాశాల (ఆర్ఐఎంసీ–డెహ్రాడూన్)లో 2023–24 విద్యాసంవత్సరంలో 8వ తరగతిలో ప్రవేశానికి జూన్ 3వ తేదీన జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఈ పరీక్షకు 2011 జనవరి 2 నుంచి 2012 జూలై 1వ తేదీలోపు జన్మించిన బాలబాలికలు అర్హులని, పూర్తి సమాచారానికి 93999 76999, 86888 88802 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

200 సిమెంటు బస్తాలకు నిప్పు



చంద్రగిరి: మండలంలోని తొండవాడ జగనన్న కాలనీలో గోడౌన్‌లో నిల్వ ఉంచిన సిమెంటు బస్తాలకు గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. గురువారం రాత్రి కొంతమంది వ్యక్తులు సిమెంటు బస్తాలపై కప్పిన టార్పాలిన్ కవర్‌కు నిప్పు అంటించగా.. 200 సిమెంట్ బస్తాలు కాలిపోయాయి. ఈ మేరకు శుక్రవారం సర్పంచ్ దీపికారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు..పక్కనే ఉన్న సీసీ ఫుటేజ్‌ను పరిశీలించారు.

అశ్వవాహనంపై అరుణాచలేశ్వరుని చిద్విలాసం



విద్యుద్దీపాల కాంతులీనుతున్న పళ్లికొండేశ్వరాలయం

- పళ్లికొండేశ్వరాలయంలో వైభవంగా శివరాత్రి బ్రహ్మోత్సవాలు
- పెద్ద సంఖ్యలో తరలివస్తున్న భక్తులు

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటుపల్లెలోని ప్రముఖ సర్వమంగళాదేవి సమేత పళ్లికొండేశ్వ స్వామి ఆలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఏడవ రోజైన శుక్రవారం రాత్రి అరుణాచలేశ్వరుడు అశ్వ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో కొలువుదీరిన స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి అశ్వ వాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. ఉభయదారులుగా ఎంఆర్ తమిళరశి, టీఆర్ మోహన్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఆలయంలో కళాకారుల భరతనాట్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



వాహన సేవలో ఉభయదారులు, అర్చకులు, గ్రామ పెద్దలు

నేడు మహాశివరాత్రి, శని త్రయోదశి

శనివారం మహాశివరాత్రి, శని త్రయోదశి పర్వదినం పురస్కరించుకుని సాయంత్రం నందీశ్వరునికి విశేష అభిషేకం, రాత్రి వృషభ వాహన సేవ నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేయ గురుక్కళ్ తెలిపారు. శని మహాప్రదోషంలో పాల్గొనడానికి మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా వేలాది భక్తులు రానున్న దృష్ట్యా అందుకు తగ్గట్టు ఏర్పాట్లను ఆలయ ధర్మకర్తల మండలి, పోలీసు, దేవాదాయ శాఖ చేస్తోంది. ఆలయాన్ని విద్యుద్దీపాలు, పుష్పాలతో సుందరంగా అలంకరించారు.





అశ్వ వాహనంపై పళ్లికొండేశ్వర స్వామి, పల్లకీలో పార్వతీదేవి, కళాకారుల నృత్య ప్రదర్శన

శేషుడిపై పరమశివుడు



శ్రీకాళహస్తి: శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి శేష వాహనంపై స్వామివారు, యాళి వాహనంపై అమ్మవారు ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. మొదట స్వామి అమ్మవార్లను ఆలయ అలంకార మండపంలో విశేషంగా అలంకరించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ స్వామి అమ్మవార్లను ఊరేగింపుగా తీసుకుని రాజగోపురం వద్దకు వచ్చారు. అక్కడ స్వామివారిని శేష వాహనం, అమ్మవారిని యాళి వాహనంపై అధిష్టించారు. పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో బారులు తీరారు.

శ్రీకాళహస్తీశ్వరునికి పట్టువస్త్రాల సమర్పణ



ఆలయంలో పట్టు వస్త్రాలు అందజేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తిలో వెలసిన వాయులింగేశ్వరునికి రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు శుక్రవారం పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయం వద్దకు చేరుకున్న మంత్రి దంపతులకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు ఘనంగా స్వాగతం పలికారు. మంగళవాయిద్యాలు, మేళతాళాల మధ్య పట్టువస్త్రాలను జ్ఞానప్రసూనాంబిక అతిథిగృహం నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లి ఈఓ సాగర్‌బాబుకు అందజేశారు. ప్రభుత్వం తరపున ఈ పట్టువస్త్రాలను శ్రీకాళహస్తీశ్వరస్వామి, జ్ఞానప్రసూనాంబ అమ్మవారికి అలంకరించారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

దర్శనానంతరం మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామి, అమ్మవార్లకు మొక్కుకున్నట్టు తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన ఎంతో బాగా సాగుతోందన్నారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి అనుగ్రహంతో ప్రజలకు మరింత సేవ చేయాలని కోరుకున్నట్టు వెల్లడించారు. అనంతరం కైలాసం సెట్టింగ్‌ను మంత్రి ప్రారంభించారు.

శ్రీవారి దర్శనానికి 30 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్టుమెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 54,469 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 25,484 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.85 కోట్లు భక్తులు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం అవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 30 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

మహిళలకు ఉచితంగా టైలరింగ్‌పై శిక్షణ

చంద్రగిరి: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు టైలరింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఆంధ్రాబ్యాంకు గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 22 నుంచి 30 రోజుల పాటు మహిళలకు ఉచితంగా టైలరింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెంది తెల్లరేషన్ కార్డు కలిగి, 19 నుంచి 40 సంవత్సరాలలోపు వయసుగల వారు అర్హులని తెలిపారు. కనీసం 10వ తరగతి చదివి ఉండాలని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, రానుపోను ఒక్కసారి బస్సు చార్జీ, యూనిఫారం ఇవ్వనున్నట్టు వెల్లడించారు. శిక్షణ పూర్తిచేసుకున్నవారికి ధ్రువపత్రాలను అందజేస్తామని తెలిపారు. ఆసక్తిగల వారు ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాస్ పోర్టు సైజ్ ఫొటోలు నేరుగా సంస్థకు వచ్చి వారి పేరును నమోదు చేసుకోవాలని కోరారు. ఒక బ్యాచ్‌కు 25 నుంచి 30 మంది మాత్రమే తీసుకుంటామని, ముందుగా పేరు నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్యతను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణాభివద్ధి సంస్థ, ద్వారకా నగర్, చంద్రగిరి. ఫోన్ 79896 80587, 94949 51289, 63017 17672 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

3.5 కిలోల గంజాయి స్వాధీనం

గూడూరు: పట్టణంలో పలుచోట్ల శుక్రవారం దాడులు నిర్వహించి నలుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి 3.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఈబీ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ గూడూరు అరుంధతీయపాళెంలో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న పాదర్తి రమణయ్య, జమీరుద్దీన్, మహ్మద్‌చాన్, రంజాన్ అలీని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారి నుంచి 3.5 కిలోల గంజాయి, అలాగే 4 స్మార్ట్ ఫోన్లు, రూ.1,500 నగదు స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ కిరణ్, సిబ్బంది రమేష్, ఆనంద్, బాషా, రవి, కృష్ణ, రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

ఉన్న ఊరును వదల్లేక..

చేసిన అప్పులు తీర్చలేక!

- సేలం వాసులు తిరుపతిలో ఆత్మహత్య
- రూ.40 లక్షల వరకు అప్పులు చేసిన దంపతులు

తిరుపతి క్రైమ్: ఉన్న ఊరిని వదల్లేక.. చేసిన అప్పులు తీర్చలేక సేలంకు చెందిన దంపతులు ఊరుగాని ఊరు వచ్చి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఈస్ట్ ఎస్ఐ జయశ్యాములు కథనం.. తమిళనాడు రాష్ట్రం సేలంకు చెందిన బాలాజీ (40), నిర్మల (36) దంపతులు అదే ప్రాంతంలో ఒక దుస్తుల దుకాణాన్ని ఏర్పాటు చేసుకొని జీవనం సాగించేవారు. అయితే ఈ షాప్‌ని ఏర్పాటు చేసుకునేందుకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో రూ.40 లక్షల వరకు అప్పు తీసుకున్నారు. అంతేకాకుండా చుట్టుపక్కల వారి వద్ద కూడా పెద్ద ఎత్తున రుణాలు చేశారు. ఈ నేపథ్యంలో ఇటీవల రుణదాతల వేధింపులు మొదలు కావడంతో చేసిన అప్పులు తీర్చలేక తీవ్ర మానసిక క్షోభకు గురయ్యారు. ఈ క్రమంలో ఆత్మహత్య చేసుకోవాలని ఇద్దరూ నిశ్చయించుకున్నారు. ఈ మేరకు ఈనెల 15వ తేదీన తిరుపతిలోని పెదకాపు వీధిలోని ఓ రెస్ట్ హౌస్‌లో దిగారు. ముందుగా అనుకున్న ప్రకారం 16వ తేదీ రాత్రి ఎలుకల మందు తిని, అనంతరం ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నారు. విషయం తెలుసుకున్న ఈస్ట్ పోలీసులు శుక్రవారం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. వీరి వద్ద ఉన్న సెల్ ఫోన్లు, రైల్వే టికెట్ల ఆధారంగా ఆధారాలు సేకరించారు. అప్పుల బాధతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా తేల్చారు.

ఆరోపణలపై ప్రమాణం చేస్తారా?

- సీబీఐ విచారణకు నేను సిద్ధం
- లోకేష్, సుధీర్‌రెడ్డి సిద్ధమా?
- శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సవాల్



శ్రీకాళహస్తి: తనపై చేసిన అవినీతి ఆరోపణలకు శివరాత్రి పర్వదినాన శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో ప్రమాణం చేసి సీబీఐ విచారణకు తాను సిద్ధమని, నారా లోకేష్, బొజ్జల సుధీర్ రెడ్డి సిద్ధమా? అని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సవాల్ విసిరారు. శుక్రవారం ఎమ్మెల్యే విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని నారా లోకేష్ సైకో అని విమర్శించడం అర్థరహితమన్నారు. అసలైన సైకో చంద్రబాబే అని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి శ్రీరాముని పాలన అందిస్తున్నట్లు చెప్పారు. దరిద్రానికి బ్రాండ్ అంబాసిడర్ అయిన వారు ముఖ్యమంత్రిని విమర్శించడం సరికాదన్నారు. ఇసుకను దోచుకుని 17మందిని పొట్టన పెట్టుకున్న ఘనత మీది కాదా అని ప్రశ్నించారు. కరోనా కాలంలో నియోజకవర్గ ప్రజలకు తాను అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించానని చెప్పారు. నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదని విమర్శిస్తున్నారని తాను చేసిన అభివృద్ధికి బహిరంగంగా చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. 50వేల మెజార్టీతో గెలుస్తానని సుధీర్‌రెడ్డి చెబుతున్నారని కనీసం ఆయనకు డిపాజిట్ రాదన్నారు. ముఖ్యమంత్రిని, తనను విమర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

దేవం.. స్వర్ణ కవచధరం



ముక్కంటి ఆలయంలోని శ్రీవేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి విగ్రహాలకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి శుక్రవారం స్వర్ణ కవచాలను వితరణ చేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతులమీదుగా విశేష ఆభరణాలను అందజేశారు. ఎమ్మెల్యే సిద్ధం చేయించిన బంగారు తొడుగులు అద్భుతంగా ఉన్నాయని మంత్రి ప్రశంసించారు.

– శ్రీకాళహస్తి

మానవజాతి అభివృద్ధికి తోడ్పడుదాం

- 'పద్మావతి'లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై అవగాహన సదస్సు
- హాజరైన తిరుపతి, చిత్తూరు జిల్లాల అధికారులు



మాట్లాడుతున్న ప్లానింగ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి విజయకుమార్

తిరుపతి అర్బన్: మానవజాతి అభివృద్ధికి తోడ్పడుదామని ప్లానింగ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి విజయ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో రాష్ట్ర ప్రణాళికశాఖ ఏర్పాటు చేసిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన, స్పందన ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లానింగ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో దేశ, రాష్ట్ర అభివృద్ధి ర్యాంకింగ్‌ను సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై గణాంకాలు చేపట్టి వెల్లడిస్తారని చెప్పారు. ప్రధానంగా పేదరిక నిర్మూలన, ప్రాథమిక విద్యను ప్రోత్సహించడం, అటవీ సంపద కాపాడడం నిర్దేశించుకుని పనిచేయాలని చెప్పారు. తిరుపతి జిల్లా కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో వివిధ శాఖల వారు అమలు చేస్తున్న పథకాలలో 61 సూచికలను బాధ్యతగా పర్యవేక్షించాలని చెప్పారు. కార్యక్రమంలో జేసీ డీకే బాలాజీ, మున్సిపల్ కమిషనర్ అనుపమ అంజలి, తిరుపతి, చిత్తూరు డీఆర్వోలు శ్రీనివాసరావు, రాజశేఖర్, జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారులు అశోక్‌కుమార్ రెడ్డి, లక్ష్మీదేవి, అదనపు ఎస్పీ జగదీష్, ఆర్డీఓ కనకనరసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశోధకుల ఫెలోషిప్‌ను పెంచాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

ఏర్పేడు: పెరిగిన ద్రవ్యోల్బణానికి అనుగుణంగా పరిశోధకుల ఫెలోషిప్‌ను కేంద్ర ప్రభుత్వం పెంచాలని విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని తిరుపతి ఐఐటీ క్యాంపస్‌లో ఆల్ ఇండియా రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ (ఏఐఆర్ఎస్ఏ) ఇచ్చిన పిలుపుమేరకు పీహెచ్‌డీ, ఎంఎస్ (రీసెర్చ్) విద్యార్థులు నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ పరిశోధనా పత్రాల ప్రచురణలో దేశం తృతీయ స్థానంలో ఉందన్నారు. ప్రపంచ సృజనాత్మకత సూచికలో 81వ స్థానం నుంచి 40వ స్థానానికి చేరుకున్నట్లు చెప్పారు. దేశీయ పేటెంట్స్‌లో 9 స్థానంలో ఉందన్నారు. ఈ లక్ష్యాలు పరిశోధనా విద్యార్థుల అంకిత స్వభావం, నిరంతర శ్రమతో సాకారమైనట్లు పేర్కొన్నారు. శ్రమకు సరైన ప్రోత్సాహకం ఏ ప్రభుత్వం గుర్తించడంలేదని వాపోయారు. నిబంధనల ప్రకారం ఫెలోషిప్‌ను భేషరతుగా 4 ఏళ్లకు పెంచాలని, రీసెర్చ్ స్కాలర్స్‌పై జరుగుతున్న వేధింపులను అరికట్టాలన్నారు.